# తండ్రి మనసు

*గరికపాటి కృష్ణమూర్తి*

"రా ... రామ్మా ... అక్కడే నుంచున్నావేం ?" వంటగది గుమ్మాన్నాను కొని లోపలకి వద్దామా వద్దాఅని తచ్చాడుతున్న పార్వతిని పిల్చింది జానకమ్మ. పార్వతి లోపలి కడుగు పెట్టింది. జానకమ్మ పీట వేసింది. జానకమ్మ అప్పుడే బియ్యం కడిగి ఎసట్లో వేసి గరిటెతో కలుపుతోంది.

పార్వతెప్పుడు వచ్చినా మధ్యాహ్నమో, సాయంకాలమో వచ్చేది.

ఇవ్వాళ ప్రొద్దుటే వచ్చింది.

ఏదో ప్రత్యేకమైన విషయముంటే మినహా ఉదయమే రాదు.

"ఏమ్మా పార్వతీ! ఇవ్వాళ ఉదయమే వచ్చావు ?"

"అదే ... అదే ... అత్తయ్యా!"

"ఏమిటి ? ... అదేమిటి ?"

"అదే ... ఈ రోజు వాళ్లొస్తున్నారు."

"వాళ్లెవరూ ?"

"పెళ్లివారు." తల వంచుకుని సిగ్గుతో అన్నది. లోలోన భయభయంగా, గుబులు గుబులుగా ఉన్నది.

"ఓ...అలాగా..." నవ్వింది జానకమ్మ.

"ఏమో అత్తయ్యా నాకు భయంగా ఉన్నదీసారి." నేలమీద ఏదో రాస్తూ అన్నది.

"భయ మెందుకమ్మా! ... ఏమీ పరవా లేదులే ... ఇంతకీ ఎవరట వాళ్లు."

"ఆవలూరు బెజవాడ దగ్గర చిన్న వూరట ... ఇద్దరే అన్నదమ్ములట. అక్కా చెల్లెళ్లు ఎవరూ లేరట. ఆస్తిపాస్తులు పరవాలేదట. తల్లీ దండ్రి యింటి పాటునే ఉండి వ్యవసాయం చూచుకుంటూ ఉంటారట.

"ఎంత గడుచు దానివే! ఇంతకీ అతని విషయం తెలియదంటావు." నవ్వుతూ అడిగింది జానకమ్మ.

పార్వతి సిగ్గుపడింది.

"హైదరాబాద్‌లో ఉద్యోగమట. ఉద్యోగం కూడా పెద్దదేనట. నెలకు అరొందలు పైన వస్తయ్యని నాన్నగారు అమ్మతో అంటున్నారు."

"ఇంకేం చాలా అదృష్టవంతురాలివే."

"ఏమో అత్తయ్యా! ఇన్ని ఉన్న వాళ్లకి మరెన్ని కోరికలుంటయ్యోనని."

"అవేమీ తెల్సుకోకుండానే మీ నాన్నగారు మాత్రం నిన్ను చూపించటానికి ఒప్పుకొన్నారా ?"

పార్వతి యేమీ సమాధానం యివ్వలేదు.

నాన్నగారు మాత్రం యేమీ ఆలోచించకుండా రమ్మని ఉంటారా?...ఏమో? అనినా అనవచ్చు. పోయినసారి వచ్చినవాళ్లు పిల్ల నచ్చిందికాని కట్నం చాలదన్నారు. ఇంకొకరు కట్నం చాలలేదని అనలేక పిల్ల యింకా చాయలో ఉంటే బాగుండేదని పెదవి విరిచారు. అయినా నాన్నగారి పిచ్చి నాన్నగారిదే... ముందు పిల్లని చూడండి తర్వాత కట్నాలు కానుకలు విషయం మాట్లాడుకోవచ్చని తీసుకొస్తారు. అమ్మ 'ఎందుకండీ అంత తూగలేని సంబంధాలు జోలికి పోతారని' అంటే "అయితే నా బిడ్డని దారినిపోయే దానయ్యకివ్వమంటావా ?" అని కస్సున లేచారు. అప్పటినుండి అమ్మకూడా యెప్పుడూ యేమీ ఎదురు చెప్పటంలేదు. ఆయన ఆశ ఆయనిది. ఆయన తాపత్రయం ఆయనిది.

తనను మాత్రం ప్రతిసారి కొంచెం కొంచెం ఆశలు కల్పిస్తూ పెళ్లి చూపులకి తయారు చేస్తుంది అమ్మ. అవి విఫలమైనపుడు వాళ్లని తిడుతూ తనని ఓదార్చుతుంది.

"అయితే పార్వతీ! ఈ విషయం యింత వరకూ చెప్పనేలేదేం ?"

"ఎందుకత్తయ్యా! ప్రతి సారి జరిగే తంతేగదాని" నైరాశ్యం ఆవరించిన దానిలా అన్నది.

జానకమ్మకు కూతురు జ్ఞాపకమొచ్చింది. నీళ్లు తిరిగినయ్.

జానకమ్మ భర్త రామనాథం యీ సంభాషణంతా లోపల్నుండి వింటూనే ఉన్నాడు.

పార్వతి యేదో దిగులు, నిరాశ, భయం ఆవరించినట్లు మాట్లాడుతూంది. మున్ముందు పద్దెనిదేళ్లు లేవు. ఎన్నో ఆశలతో మరెన్నో కోర్కెలతో ఊహాపథంలో ఉయ్యాల లూగే వయస్సది. ఆ కోర్కెలు సఫలీకృతం కాకపోయేటప్పటికి జీవితానుభవంలేని బిడ్డలు ఎలా క్రుంగిపోతున్నారు !!

ఇంట్లోనుండి వంటయింటి వైపు వచ్చాడు రామనాథం. పార్వతి మోకాలి మీద తల పెట్టుకొని మసిబొగ్గుతో క్రింద రాస్తూందేదో!

"ఎప్పుడొస్తారమ్మా" అడిగాడు.

గబుక్కున లేచి ప్రక్కకి తొలగింది పార్వతి.

"కూర్చోఅమ్మా" అని "సాయంకాలం వస్తారేమో?" అన్నది భర్తకి సమాధానంగా జానకమ్మ.

ఔనన్నట్లు తలూపింది పార్వతి.

రామనాథం పార్వతి వంక చూశాడు. ముఖంలో వర్చస్సున్నా జీవంలేదు. కళ్లు విశాలమైనా కళలేదు. పెళ్లి చూపుల్లో ఉండాల్సిన ఉద్రేకత లేదు. అసలు పిల్లలో చలనమున్నట్లు కన్పించటం లేదు.

పెళ్లిచూపుల పరీక్షలో కృతార్థురాలిని కాలేనన్న భయంతో వణికిపోతూంది పార్వతి.

మరి తనబిడ్డ ఎంతగా కుమిలిపోయిందో? ఎంత మనో వ్యధ బాధితురాలైందో? మనసు యెంత క్షోభ చెందిందో ?

ఒక్కసారి సంవత్సరం వెనక్కి వెళ్లినవి రామనాథం ఆలోచనలు.

ఇరుగు పొరుగు వారవటమే కాకుండా దూరపు బంధుత్వం దృష్ట్యా కూడా రామారావుకు లలితనిస్తే యింటికెదురుగా కళ్లెదుట ఉంటుందని ఆశపడ్డారు. ఈ విధంగా తనూ, తన భార్య మాత్రమే, ఆశలు పెట్టుకోలేదు. లలిత పుట్టినప్పటి నుండీ, వెంకట్రామయ్యకూడా మా కోడలు, కోడలంటూనే ఉన్నాడు. తాము కూడా రామారావుని కాబోయే అల్లుడుగానే భావించుకుంటూ వచ్చారు. పెద్దవాళ్ల సరసలు, అనుకోవటాలు వాళ్లవరకే పరిమితం అయితే బాగుండేది. కాని లలితలో కూడా ఆ భావం ఉద్భవించడానికి, వృద్ధి చెందటానికి యిటు తాము, అటు వెంకట్రామయ్య కుటుంబంవారుకూడా కారకులే. యిద్దర్నీ యిరుగుపొరుగు వారేగాక యీడూజోడూఅనికూడా ఎగతాళిచేసేవారు.

లలిత వ్యక్తురాలైన తర్వాత చదువుమాని పించారు. రామారావు, అప్పటికే దగ్గర టౌన్లో కాలేజీ చదువు సాగిస్తూ ఉండేవాడు.

రామనాథం కూతురు పెళ్ళి విషయం యెత్తినప్పుడల్లా వెంకట్రామయ్య "ముందు వాడిచదువు పూర్తి కానియ్ బావా! తర్వాత అలాగే కానిద్దాం" అనేవాడు.

రామారావుకూడా బుద్ధిగా చదివి బి. ఏ ప్యాసయ్యాడు. ప్యాసవ్వటం కంటే అతని అదృష్టం వెంటనే ఉద్యోగం దొరకటం. అందరూ లలిత అదృష్టవంతురాలన్నారు. లలితకారోజు పట్టపగ్గాలే లేకపోయినయ్. రామారావుతో పెళ్ళి, కొత్తగా పట్నంలో కాపరం. సినిమాలు, సరదాలు... ఓయ్... ఊహా లోకాల్లో తేలిపోయింది.

రామారావు ఉద్యోగమైన కొన్నాళ్ళకు మళ్ళీ రామనాథం పెళ్ళివిషయమై యెత్తాడు వెంకట్రామయ్య వద్ద,

"దానిదేముందిలే బావా; అలాగే కానిదాం కాని రాముడు ఉద్దేశం కూడా కనుక్కోవాలి కదా!" అన్నాడు.

రామనాథం కొంచెం గతుక్కుమన్నాడు.

మళ్ళీ తేరుకొని 'తన పిచ్చిగాని రామారావు కాదంటాడేమిటి?' అనుకొన్నాడు.

కాని మరికొన్నాళ్ళకు ఆనోటాయినోటా విన్నదేమిటంటే రామారావుకు నాలుగెకరాల మాగాణి, ఐదు వేలుకట్నం యిస్తామని వస్తున్నారని, వెంకట్రామయ్య కూడా కొడుకుని తీసుకొని పెళ్ళి చూపుల కెళ్ళి వచ్చాడని.

దీంతో రామనాథం దంపతులు హతాశు లయ్యారు.

మోసపోయ్యామనుకొన్నారు. వెంకట్రామయ్య నమ్మించి ద్రోహం చేశాడనుకొనుకొన్నారు.

ఇక లలిత విషయం చెప్పనే అవసరంలేదు. విద్యుద్ఘాతం తిన్న దానిలా అయిపోయింది. వెళ్ళడించుకోలేని వ్యధ. మరల్చుకోలేని మనసు నిస్సహాయులైనతల్లిదండ్రుల మనోవ్యాకులత.

"రామనాథం ఏమిస్తాడు ఆ పిల్లవాడికి సలక్షణమైన సంబంధ మొచ్చింది." ఇరుగు పొరుగు అమ్మలక్కల మాటలు గోరుచుట్టు మీద రోకటిపోటు లైనవి,

అవును. తనేమి యిస్తాడు. తన సర్వసం ధారపోసి సంపాదించింది రెండెకరాలు. పెళ్ళి కని దాచిపెట్టిన రెండువేలు బిడ్డకోసం ఉన్న దంతా ఊడ్చి యివ్వగలడు. తను బ్రతుకు తెరువు తర్వాత చూసుకోవచ్చు. అంతా కలిపినా వాళ్ళిచ్చే దాంట్లో సగంలేదు ... తను లేనివాడు చాలనివాడు."

ఒకనాడు వెంకట్రామయ్య గారింటికి ఆడ పెళ్ళి వారొచ్చి చూసుకుపోయారు. మరి నాల్గు రోజుల్లో నిశ్చయ తాంబూలాలు పుచ్చుకొనటం కూడా అయిపోయింది.

అంతవరకూ యెక్కడో అంతరాల్లో మిణుకు మిణుకు మంటున్న ఆశాదీపం ఆరిపోయింది.

ఆరోజు.

అదే. వెంకట్రామయ్య యింట్లో కొడుకు పెళ్ళిరోజు.

తనకి కాళరాత్రి. తన వృద్ధ జీవితాల్లో మహోజ్యంపోసి బ్రతికినంత కాలం మంటలు రేపిన రాత్రి. కన్న కడుపుల మమతాను బంధాన్ని పెటేల్మన తెంపుకొని లలిత శాశ్వతంగా విశ్రమించిన రాత్రి.

వెంకట్రామయ్య నరరూప రాక్షసుడిలా కన్పించాడు. పచ్చిరక్తం తాగే నరహంతకుడిలా వికటాట్టహాసం చేస్తున్నట్లు అనిపించాడు.

ఎదురింట్లో సన్నాయి మేళం.

తనింట్లో, పగిలిన గుండెల వాళ్ల ఆర్తనాదాలు.

ఎదురింట్లో నూతన వధూవరులకు స్వాగత నీరాజనాలు.

తనింట్లో తన జీవన జ్యోతి లలిత శవానికి వీడ్కోలు. భగవంతుడా? ఏ తల్లి దండ్రికి యిటువంటి కఠిన శిక్ష వద్దు. ఏ కన్న కడుపుకి అటువంటి రాత్రి వద్దు.

"ఏమండీ" లోపల నుండి భార్య కేకేసింది. ఆ పిలుపుతో యీ లోకంలోకి వచ్చాడు రామనాథం. కళ్ళు వత్తుకొన్నాడు.

"ఆ పెట్టెలో లలిత నెక్లెసున్నది. పార్వతికట యిమ్మంది."

"అలాగే" వెళ్ళి పెట్టెలోని తీసియిచ్చాడు.

"పార్వతి అందుకొని మామయ్యగారూ!

(43 వ పేజీ చూడండి)



# తండ్రి మనసు

(17వ పేజీ తరువాయి)

మీరు కూడా సాయంత్రం మా యింటికి రండి. అమ్మ చెప్పమనంది.'' అన్నది బిక్కు బిక్కుగా.

''అలాగేనమ్మా!''

లలిత, పార్వతి ఒక ఈడువాళ్ళే, ఇద్దరూ ఒకళ్ల నొకళ్ళు విడిచి ఉండేవారు కాదు. లలిత లాంటి పార్వతి. పార్వతి లాంటి లలిత.

*    *    *

పెళ్లికొడుకు, అతనితండ్రి, మేనమామ హాల్లో కూర్చున్నారు. పార్వతిని తీసుకొచ్చారు.

భయం భయంగా కూర్చుంది.

పరీక్ష! అగ్ని పరీక్ష!!

పెళ్లికొడుకు మేనమామయే వో నాలుగు ప్రశ్నలేశాడు.

పార్వతి సమాధాన మిచ్చింది.

వాళ్ల ముఖ సూచనలను బట్టి పార్వతి నచ్చినట్లే ఉన్నది.

పార్వతిని లోపలకు వెళ్లవచ్చన్నారు యిక.

కొంచెంసేపైన తర్వాత పెళ్లికొడుకు మేనమామే 'యిక అసలు విషయంలోకి వద్దామన్నాడు.'

''చెప్పాను కదండి. అంతకంటే యెక్కువ మోవలేనని.''

''అయితే మేమింత దూరం రావట మెందుకండి. రెండెకరాలు, రెండు వేలకి సలక్షణమైన ఉద్యోగం చేసే కుర్రాడెవ డొస్తాడండి ?''

''అవుననుకోండి. పిల్లని చూశారుకద.'' రామనాథం అందుకున్నాడు.

''ఏమైనా లాభంలేదు.'' ఖండితంగా చెప్పేస్తున్నాడు పెళ్లికొడుకు మేనమామ.

రామనాథం వెనక అలికిడైతే వెనక్కి తిరిగి చూశాడు. కిటికీ అవతల పార్వతి ఫలితం కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తోంది.

'' పోనీ యింకొక వెయ్యి. '' అన్నాడు పార్వతి తండ్రి.

''ఇవేమి బేరాలండి బాబు. మూడెకరాలకు మూడువేలకి ఒకదమ్మిడీ తగ్గినాలాభంలేదు.''

'' లాభంలేదంటారా ? '' ఆఖరిసారిగా అడుగుతున్నట్లు అడిగాడు రామనాథం.

''చెప్తున్నాం కదండి. ఇంతకంటె యెక్కువే యిస్తామని వస్తున్నారు. ఇదైనా పిల్ల కాస్త బాగుందని ఒప్పుకోవాల్సి వస్తుంది.''

''సరే. అలాగే కానివ్వండి.'' అన్నాడు రామనాథం.


''బావా ?'' పార్వతి తండ్రి కంఠంలో నిస్సహాయత ధ్వనించింది.

''నీవేమి యిచ్చుకోనవసరం లేదులేవయ్యా! వారు అదనంగా కోరేది నేనిస్తాను'' అన్నాడు రామనాథం.


''బావా!'' కంఠం రుద్ధమైనది వెంకట్రామయ్యకి.

''ఏం ఫరవాలేదు. పార్వతి నా బిడ్డ అను కొంటున్నా. నీవు యిచ్చేది ఇవ్వు. నేను యిచ్చేది నేనిస్తాను. నా తదనంతరం నాకు మిగిలింది దానికే.''

వెంకట్రామయ్య నిశ్చేష్టుడై పోయాడు. వాక్కు లేనివాడయ్యాడు. తను ఉన్నవాడని, తన కొడుక్కి యింకా ఉన్నవాళ్లు వస్తున్నారని, రామనాథం లేనివాడని ఆ నాడు కాదని అతని కడుపులో చిచ్చు పెట్టాడు.




Avilable at all leading Chemists & Druggists.



కాని ఆ నాడు తనలో, యీ నాడు తను వియ్యమందవచ్చిన వారిలో లేనిదేదో... రామనాథంలో ఉన్నది. మూర్తీభవించి ఉన్నది.

ఇంతవాడు అంతవాడుగా, అంతంతవాడుగా కన్పిస్తున్నాడు.

వెంకట్రామయ్య కళ్లు ఆర్ద్రత చెందినయ్. గొంతు పెగలటం లేదు. మాటలు రావటంలేదు. రెండు చేతులతో రామనాథం రెండు చేతుల్ని పట్టుకొని కళ్ల కద్దుకొన్నాడు.




## మృదువైన చర్మం కోసం పసిపాప నుంచి ఆ కిటుకు పొందండి

## జాన్సన్స్ బేబీ పౌడర్

మీ దేహంలోని భాగాలన్నిటికన్న మీ ముఖం పైన చర్మం ఎంతో బాహాటమైనది. మీరు వాడే పౌడరు పసిపాప చర్మం లాగే ఎంతో సున్నితంగా, సుకుమారంగా ఉండి, చర్మాన్ని మృదువుగా, నున్నగా, చల్లగా ఉంచగలగాలి. అందుకే జాన్సన్స్ బేబీ పౌడర్. దీనిని అందమైన ఆడవాళ్ళు అంతటా వాడతారు. అందువలన మీరు కూడా మీ చర్మ సంరక్షణ చేయటంకోసం జాన్సన్స్ తప్పని సరిగా వాడవచ్చును.

**మీ చర్మాన్ని అప్పుడే పుట్టిన పసిపాప అంత మృదువుగా ఉంచుతుంది**

Johnson & Johnson




® Trade Mark
© Johnson & Johnson